క్లుప్తంగా

ప్రారంభానికి నోచుకోని లేబరేటరీ



కె. కొత్తవలసలో ప్రారంభానికి నోచుకోని లేబరేటరీ

దత్తిరాజేరు: మండలంలోని కె. కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (ల్యాబ్)ప్రారంభానికి నోచుకోకపోవడంతో కొన్ని రకాల ఆరోగ్య పరీక్షలు జరగడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోగులకు ఇక్కడ కొన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయడానికి రూ. 50 లక్షలతో లేబరేటరీ నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కృషితో దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. కాంట్రాక్టర్‌కు రూ. పది లక్షల బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తయినా కాంట్రాక్టర్ మాత్రం భవనం అప్పగించ లేదు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేసి లేబరేటరీని అందుబాటులోకి తీసుకువస్తే రోగులకు ఇబ్బందులు తప్పుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం

బొండపల్లి: ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని గొట్లాం ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి బి.సునీత తెలిపారు. పదో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వే వైద్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'చలో మెడికల్ కాలేజ్'

బొండపల్లి: జిల్లా కేంద్రంలో గల మెడికల్ కాలేజ్ సందర్శనకు శుక్రవారం చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత తరలి రావాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కాలేజ్‌లను ప్రైవేట్‌పరం చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ కుట్రలను ఎండగట్టేందుకు గాను వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

100 బైక్‌లతో..

దత్తిరాజేరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలను శుక్రవారం వంద బైక్‌లతో ర్యాలీగా వెళ్లి సందర్శించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆదేశాల మేరకు పెదమానాపురం నుంచి బయలుదేరి గజపతినగరం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ నుంచి విజయనగరం బయలుదేరుతామని పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బొండపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆమె ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. జాతీయ రహదారి 26పై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అటువంటి చోట్ల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గంజాయి రవాణా, మద్యం తయారీపై నిఘా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ జీఏవీ రమణ, బొండపల్లి ఎస్సై యు.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జామి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జామి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్‌వీ శేఖర్ కుమార్ తెలిపారు. ఇటీవల మరుపల్లి పాఠశాలలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఎన్. గణేష్, బి.రాహుల్, కె.ఋూన్సీ రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈమేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో పీడీలు యూఎస్ ఆనంద్, బి.ఎర్రమ్మ, తదితరులతో కలిసి గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

మెరకముడిదాం: ఈ నెల 21న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అగ్ర తాంబూలం ఏదీ..?

- కూటమి దెబ్బకు కూలుతున్న ప్రజావ్యవస్థ
- మహిళా సర్పంచ్‌ని వేధించడమే టార్గెట్
- నిబంధనలకు పాతరేసిన పచ్చనేత
- పంచాయతీని పట్టించుకోని అధికారులు



శృంగవరపుకోట: రెడ్‌బుక్ రాజ్యాంగం పక్కాగా అమలు చేస్తున్నారు కూటమి నేతలు. నిబంధనలను పాతరేసిన వారికి ఊతమిస్తున్నారు జిల్లా అధికారులు. అన్నింటా సగమైన ఆడబిడ్డలకే మా ప్రభుత్వంలో అగ్రతాంబూలం అని చెప్పుకుంటున్న కూటమి నేతల దుర్నీతికి.. ఆడపడుచులపై చూపుతున్న వివక్షకు వేపాడ మండలం బానాదిలో జరుగుతున్న పంచాయితీయే సాక్ష్యం.

మహిళా సర్పంచ్ టార్గెట్..

కూటమి అధికారంలోకి రాగానే వేపాడ మండలం బానాది గ్రామ సర్పంచ్ కర్రి యశోదను టార్గెట్ చేశారు పచ్చనేతలు. తమకు అనుకూలమైన పంచాయతీ కార్యదర్శికి బానాది పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించి ఇబ్బంది పెట్టడం ఆరంభించారు. సచివాలయాన్ని పాత భవనంలోకి మార్చడంతో ప్రారంభమైన వేధింపులు కనీసం పంచాయతీ సమావేశం నిర్వహించకుండా సర్పంచ్‌ను ఇబ్బంది పెట్టారు. సదరు కార్యదర్శి వేధింపులు తట్టుకోలేక మహిళా సర్పంచ్ కలెక్టర్, డీపీఓ వద్ద తమ గోడు వెల్లబోసుకుంది. చివరకు కలెక్టరేట్ వద్ద ధర్నా కూడా చేయాల్సి వచ్చింది. దీంతో డీఎల్‌పీఓ స్పందించి ఆ కార్యదర్శిని గుమ్మలక్ష్మీపురం బదిలీ చేశారు.

మళ్లీ మొదలైన లొల్లి..

ఇటీవల నియోజకవర్గానికి చెందిన పచ్చనేత ఒకరు ఎంపీ వద్ద చక్రం తిప్పి ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు అడ్డగోలు బదిలీలు చేయించి, అందులో సదరు కార్యదర్శిని డిప్యూటేషన్ పేరుతో సొంత మండలం వేపాడలో బానాది పంచాయతీ కార్యదర్శిగా తిరిగి పోస్టింగ్ ఇప్పించారు. దీంతో మళ్లీ మహిళా సర్పంచ్ యశోదకు వేధింపులు ప్రారంభమయ్యాయి.

సమావేశంలో స్పందన లేదు..

వేపాడ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బానాది సర్పంచ్ కర్రి యశోద మాట్లాడుతూ.. గతంలో డీఎల్‌పీఓ పనిష్మెంట్‌గా గుమ్మలక్ష్మీపురం బదిలీ చేసిన కార్యదర్శిని తిరిగి సొంత మండలంలో ఎలా పోస్టింగ్ ఇస్తారు.. ఆయన 14 నెలలుగా పంచాయతీ సమావేశం ఎందుకు నిర్వహించలేదు.. ఈ విషయాలను కలెక్టర్, డీపీఓలకు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదు.. నన్ను తిట్టి, అవమానపరిచిన అదే కార్యదర్శిని మళ్లీ మా పంచాయతీకే ఎలా తీసుకువస్తారని అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించినా ఒక్కరి నుంచి సమాధానం రాకపోవడం విశేషం. సచివాలయంలో పంచాయతీ సమావేశం నిర్వహించాలని అధికారులు చెప్పినా, సదరు కార్యదర్శి కాదనడం కొసమెరుపు. మహిళా సర్పంచ్ గోడు విని కొందరు సర్పంచ్‌లు, ఎమ్మెల్సీ, ఎంపీపీ, తదితరులు సమావేశం నుంచి వాకౌట్ చేస్తామని చెప్పడంతో ఎట్టకేలకు ఎంపీడీఓ విచారణ చేస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. మహిళలకు అగ్రతాంబూలం ఇస్తామన్న కూటమి నాయకులు ఇలా మహిళా సర్పంచ్‌లను వేధించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన గరివిడి నాయకులు



మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డితో సీనియర్ నాయకుడు బొత్స, గరివిడి మండల నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వైఎస్సార్‌సీపీ గరివిడి మండల నాయకులు మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి ప్రతిపక్షనాయకుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో జగనన్నను కలిసి నియోజకవర్గ స్థితిగతులపై చర్చించారు. జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, రేగటి ఎంపీటీసీ సభ్యుడు కడుమల రాంబాబు ఉన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఎస్.కోటలో రోడ్డులో జేసీబీతో ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట: 'కోట'కు కొత్తరూపు రానుంది.. ప్రధాన రహదారికి పట్టిన ఆక్రమణల పీడ విరగడ అయ్యిందంటూ పట్టణ వాసులు మురిసిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా మొత్తుకుంటున్న సమయంలో అధికారులు ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. ఆక్రమణలు గుర్తించిన రెవెన్యూశాఖ తన పని పూర్తి చేసి ఆర్‌అండ్‌బీకి అప్పగించింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆక్రమణలు తొలగిస్తూ, మరోపక్క డ్రెయిన్ల నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. ప్రస్తుతం స్థానిక జూనియర్ కళాశాల నుంచి కొంతమేర డ్రెయిన్ పనులు పూర్తి చేశారు. మిగిలిన రోడ్డులో ప్రస్తుతం డ్రెయిన్ల తవ్వకాల పనులు జోరుగా చేస్తున్నారు. కాగా స్థానికులు శివప్రియ హోటల్ వద్ద ఉన్న గెడ్డలోకి మురుగునీరు వెళ్తుందా.. లేదా.. అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శివప్రియ హోటల్ నుంచి షిర్డీసాయి ఆలయం వరకు ఉన్న ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులు.. శివప్రియ హోటల్ వద్ద కల్వర్టుపైన ఏర్పాటు చేసిన దుకాణాలను తీయించాలని పంచాయతీరాజ్ అధికారులు ఉన్నతాధికారులను కోరారు. అయితే అధికారులు మాత్రం ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోపక్క దేవీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రెండో వైపు కొన్ని ఆక్రమణలు తొలగించినా, పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. దీంతో ఆక్రమణల తొలగింపు పనులు ఒకవైపు జరుగుతుండగానే.. ఆక్రమణదారులు మళ్లీ ఆక్రమణలకు సిద్ధమవుతున్నారు. పనులు పూర్తికాక ముందే మళ్లీ రోడ్లపై దుకాణాలు వెలుస్తుంటే పట్టణ పోలీసులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్టుగా చూస్తున్నారు. పంచాయతీ ఉద్యోగులు మాత్రం చేతులు తడుపుకుంటూ, మళ్లీ ఆక్రమణలకు జెండా ఊపుతున్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చేస్తున్న రహదారి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

జంక్ ఫుడ్‌తో ఊబకాయం

- సీడీపీఓ ఉమాభారతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాభారతి

గంట్యాడ: జంక్ ఫుడ్ తింటే ఊబకాయం వస్తుందని సీడీపీఓ డి. ఉమాభారతి అన్నారు. మండలంలోని గొడియాడ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం యువత ఎక్కువగా ఊబకాయం భారిన పడుతున్నారన్నారు. న్యూడిల్స్, పానీపూరి, డీప్ ఫ్రై స్నాక్స్ వంటివి ఎక్కువగా తినడం వల్ల ఊబకాయం వస్తుందని.. యువత ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

పౌష్టికాహారం తీసుకోవాలి..

మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ పోషణ మాసం, స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నరవ, మదనాపురం సర్పంచ్‌లు జాగరపు అప్పారావు, పతివాడ భాస్కరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత, సీడీపీఓ ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం



వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ కూర్మారావు

లక్కవరపుకోట: ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం సిద్ధం చేయాలని ఎంఈఓ చలుమూరి కూర్మారావు ఆదేశించారు. మండలంలోని కిత్తన్నపేట ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అలాగే బోధనా తీరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, డ్వాక్రా మహిళలు

జామి: మండలంలో లొట్లపల్లి పంచాయతీ అలమండ సంత వద్ద వెలుగు ఏపీఎం అప్పలనాయుడు ఆధ్వర్యంలో 'మన డబ్బులు – మన లెక్కలు' కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు డిజిటల్ లిటరసీ, సంఘ లావాదేవీలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీసీలు కృష్ణ, చినబాబు, అప్పలనాయుడు, వీఏఏ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వీడని యూరియా కష్టాలు



బలిఘట్టాం రైతుసేవా కేంద్రం వద్ద అధికారులు రాకపోవడంతో పాస్ పుస్తకాలను క్యూలైన్‌లో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు

కొత్తవలస: యూరియా కష్టాలు రైతులను వీడడం లేదు. ఉదయం నుంచి గంటల తరబడి క్యూలో నిల్చొన్నా ఒక్క బస్తా కూడా దొరక్కపోవడంతో అన్నదాతలు ఉసురోమంటూ వెనుదిరుగుతున్నారు. మండలంలోని బలిఘట్టాం రైతుసేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేస్తామని అధికారులు తెలియజేయడంతో రైతులు గురువారం ఉదయం పెద్దెత్తున చేరుకున్నారు. క్యూలైన్‌లో నిలుచోలేక రైతులు తమ ఆధార్, పాస్ పుస్తకాలు పెట్టి చెట్ల కిందకు వెళ్లిపోయారు. అధికారులు తీరిగ్గా 11 గంటలకు వచ్చి 250 బస్తాలు పంపిణీ చేసి స్టాక్ అయిపోయిందని చెప్పి వెళ్లిపోయారు. మిగిలిన రైతులకు యూరియా ఎప్పుడిస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

జాబ్‌మేళా రేపు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జె.కె.సి), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసి, 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు సెమినార్ హాల్‌కు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు



కమ్యూనిటీ హాల్ పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీషా అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గతంలోనే జిల్లా పరిషత్ నుంచి రూ.6 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అయితే నిధులు చాలక పనులు నిలిచిపోవడంతో సర్పంచ్ మంగళగిరి సుధారాణి తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెంటనే ఈ విషయాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి.. మరో ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ నిధులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, గవిడి సురేష్, అద్దూరి కృష్ణ, ముల్లు పైడిరాజు, గవిడి కల్కి, ఇప్పిలి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన ఎరువాక పైడినాయుడు(45) 16 ఏళ్లుగా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పరిధిలోని దివీస్ ఫార్మా కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తూ అంకిరెడ్డిగూడెంలోనే భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తున్నాడు. అతడి పెద్ద కుమార్తెకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని వైద్యులు చెప్పడంతో కొంతకాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఆర్థికంగా కూడా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.


బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ ప్రమీలారాణి

జామి: మండల కేంద్రంలోని వెలుగు సమాఖ్య కార్యాలయంలో బీఎల్‌ఓలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ ప్రమీలారాణి బీఎల్‌ఓల విధులపై దిశానిర్దేశం చేశారు. రాబోవు రోజుల్లో చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కృష్ణంరాజు, హెచ్‌డీటీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌లను అభివృద్ధి చేయాలి



జాకేరులో విద్యార్థులకు గణితం బోధిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: పాఠశాల ఆవరణల్లోని కిచెన్ గార్డెన్‌ల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని జాకేరు, కరకవలస గ్రామాల్లోని పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. అంతకుముందు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

- జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష



కొత్త అగ్రహారంలో మెడికల్ క్యాంప్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధారాణి, తదితరులు



దత్తిరాజేరు: మరడాంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రఘు



వేపాడ: నీలకంఠరాజపురం వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు

చీపురుపల్లి:

కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అమల్లోకి తీసుకొచ్చిన స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంప్‌లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష అన్నారు. పట్టణంలోని కొత్త అగ్రహారంలో గురువారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీషా మాట్లాడుతూ.. గర్భిణీలకు తనిఖీలు, క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్లాం మెడికల్ ఆఫీసర్ పి.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి..

దత్తిరాజేరు: మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని కె. కొత్తవలస, దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బి. రఘు, సతీష్‌కుమార్ అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మరడాం, పెదమనాపురం గ్రామాలలో వేర్వేరుగా వైద్యశిబిరాలు నిర్వహించి 189 మందికి వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 17న ప్రారంభించిన ఈ కార్యక్రమంలో గాంధీ జయంతి అక్టోబర్ రెండు వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు 14 రకాల వైద్యసేవలు అందిస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

వేపాడ: వైద్యశాఖ అందిస్తున్న వైద్యసేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నీలకంఠరాజపురం ఎంపీటీసీ సభ్యుడు చినరామునాయుడు కోరారు. వేపాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నీలకంఠరాజపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దేవి, గ్రామపెద్దలు జగ్గుబాబు, వైస్ సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఉత్సవాల్లో మాజీ ఎంపీ



విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తదతరులు

చీపురుపల్లి: విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. పట్టణంలోని హడ్కో కాలనీలో గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రెండు రోజులుగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం ఆలయానికి వెళ్లిన మాజీ ఎంపీ బెల్లానకు కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అలాగే విశ్వకర్మను దర్శించుకున్న బెల్లాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

డీలర్‌పై 6ఏ కేసు నమోదు

జామి: మండలంలోని లొట్లపల్లి ఇన్‌చార్జ్ రేషన్ డీలర్ లక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌ఓ లావణ్యతో కలిసి డిపోను గురువారం తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో 1825 కిలోల బియ్యం, 13 ప్యాకెట్ల పంచదార, ఐసీడీఎస్ బియ్యం 25 కిలోలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.